క్లుప్తంగా

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్



హనుమాన్‌జంక్షన్‌రూరల్: అవినీతి, పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి, ప్రముఖ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు నివాసానికి శనివారం ఆయన విచ్చేశారు. ఇద్దరు నేతలు కొద్దిసేపు రాజకీయాలపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించటం ఖాయమని డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ దుట్టా చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. నేతలు దుట్టా శివన్నారాయణ, దుట్టా రాంబాబు, అల్లంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు శైవాగమ ప్రకారం శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం దీక్షాధారణ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకం, హోమశాల ప్రవేశం జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి పూజాదికార్యక్రమాలు విశేషంగా తిలకించి నీరాజన తీర్థప్రసాద కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొన్నారు. ఆలయ ఈఓ ఎన్.అరుణ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు ఎం.ఫణికుమార్ నేతృత్వంలో సాంప్రదాయబద్ధంగా పూజలు జరిగాయి. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



ఉంగుటూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షేక్ సాధియా అల్‌మాస్ అన్నారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో వార్షిక క్రీడా మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కళాశాల డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. క్రీడలు శారీరకంగా ఆరోగ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని కలగజేస్తాయని చెప్పారు. తమ కళాశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యతనిస్తామని ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ తెలిపారు. అనంతరం వివిధ క్రీడల్లో గెలుపొందిన వారికి చైర్మన్ సుంకర రాంబ్రహ్మం అందజేశారు.

సమతుల ఆహారంతో ఆరోగ్య రక్షణ

గన్నవరంరూరల్: మండలంలోని జక్కులనెక్కలం గ్రామంలో సచివాలయం వద్ద శనివారం 104 వాహన వైద్య సేవలు గ్రామస్తులకు అందించారు. డాక్టర్ సృజన రోగులను పరీక్షించి 50 మందికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య రక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సమతుల ఆహారం, ఆహారంలో పాలు, పండ్లు ఉండేటట్లు చూసుకోవాలని చెప్పారు. సీహెచ్‌ఓ నిస్సీ, ఆశా వర్కర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

పెనమలూరు: ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధమని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. నా ఓటు – నా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా శనివారం పెదపులిపాక, తాడిగడప గ్రామాల్లో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందన్నారు. ఓటు నమోదు చేసుకొని ఎన్నికల సమయంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు లేని వారు దరఖాస్తు చేస్తే ఓటు హక్కు కల్పిస్తారని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏఓ శైలజ తెలిపారు.

శని త్రయోదశి పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు నవగ్రహాలకు శని త్రయోదశి పూజలు చేశారు. భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధి పథంలో రామవరప్పాడు

- రూ.6.50 కోట్ల నిధులతో రహదారులు, డ్రెయిన్ల అభివృద్ధి
- రూ.2.50 కోట్లతో ప్రభుత్వ భవనాలు
- రూ.4 కోట్లతో తాగునీటి సమస్యలకు చెక్
- రూ.కోటితో కాపు, బీసీ కల్యాణ మండపాల నిర్మాణం
- రూ.1.9 కోట్లతో రైతుబజార్ నిర్మాణ పనుల ప్రారంభం



సువిశాల సీసీ రహదారిగా ఆక్స్‌ఫర్డ్ స్కూల్ రోడ్డు





తుది దశలో ఉన్న సచివాలయ నిర్మాణం

రామవరప్పాడు: నగరానికి అతి సమీపంలో ఉన్న మేజర్ పంచాయతీ రామవరప్పాడు అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామం కావడం, నగరానికి కూతవేటు దూరంలో ఉండటంతో గ్రామ నివాసితులతో పాటు వలస వచ్చే వారి సంఖ్య కూడా రెట్టింపు అయ్యింది. ప్రస్తుత అంచనా ప్రకారం ఈ గ్రామంలో సుమారు 45 వేల మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ గ్రామాభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ గ్రామ రూపురేఖలు మారిపోయాయి. ఎటు చూసిన సిమెంట్ రహదారులు, పక్కా డ్రెయిన్లు, కాల్వగట్టు ప్రాంతాల్లోని అభివృద్ధి పనులతో కొత్త రూపును సంతరించుకుంది. మేజర్ గ్రామం కావడంతో ఈ ఒక్క గ్రామంలోనే 5 సచివాలయాలు, 3 హెల్త్ సెంటర్లు, ఆర్బీకే సెంటర్ ఈ గ్రామంలో ఏర్పాటు అవుతున్నాయి.

వాటర్ పైప్‌లైన్ పనులు పూర్తి

గ్రామంలో 40 సెంట్ల స్థలంలో రైతుబజారు ఏర్పాటు చేసేందుకు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందుకోసం వ్యవసాయ మార్కెట్ శాఖ నుంచి రూ.1.9 కోట్లు మంజూరయ్యాయి. గ్రామంలో తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.4 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేజర్ పంచాయతీలో ప్రస్తుతం 4 ట్యాంకులతో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నానాటికీ జనాభా పెరుగుతుండటంతో ఉన్న వాటర్ ట్యాంకులు సరిపోకపోవడంతో కొత్తగా మంజూరైన నిధులతో మరో 4 వాటర్ ట్యాంకులను నిర్మించనున్నారు. అలాగే గ్రామం మొత్తం వాటర్ పైప్‌లైన్ విస్తరణ పనులు పూర్తి చేశారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సకాలంలో నిధులు మంజూరవ్వడంతో ప్రారంభించి చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేశాం. తాజాగా రూ.40 లక్షల నిధులతో గ్రామంలో పలు రహదారులు, డ్రెయిన్ల అభివృద్ధి పనులను ప్రారంభించాం. వీటి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామంలోని అన్ని రహదారులు, డ్రెయిన్లు అభివృద్ధి చేశాం. అభివృద్ధికి నోచుకోక దీన స్థితిలో ఉన్న హిందూ శ్మశానవాటికను సుందరంగా అభివృద్ధి చేయగలిగాం. దాత సహకారంతో గ్రామంలో కర్మల భవనాన్ని ఏర్పాటు చేసుకున్నాం.

– వరి శ్రీదేవి, రామవరప్పాడు సర్పంచ్

యుద్ధప్రాతిపదికన ప్రభుత్వ భవనాలు

గ్రామంలో 5 సచివాలయాల భవనాలు ఏర్పాటు కానున్నాయి. ఒకటి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేయగా మిగతా నాలుగు సచివాలయాల నిర్మాణ పనులు రూ.1.70 కోట్ల నిధులతో తుది దశకు చేరుకున్నాయి. అలాగే రూ.63 లక్షలతో 3 హెల్త్ సెంటర్లు, రూ.17 లక్షలతో ఆర్బీకే సెంటర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నాడు – నేడు పథకం కింద రూ.1.63 లక్షలతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. హైస్కూల్ రోడ్డులోని జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి రూ.1.7 కోట్లు, అలాగే 3 మండల పరిషత్ పాఠశాలల అభివృద్ధికి రూ.56 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, అదనపు తరగతుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు అభివృద్ధి చేసేందుకు పంచాయతీ, మండల పరిషత్ నిధులు రూ.6.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించి పూర్తి చేశారు. గ్రామంలోని అన్ని రహదారులు, డ్రెయిన్ల అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తి చేశారు. గత ప్రభుత్వంలో అంతిమ సంస్కరణలు చేసుకునేందుకు అవస్థలు పడ్డ గ్రామస్తులకు రూ.60 లక్షలతో హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేశారు.

పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ)

ఇళ్ల స్థలాలు	1,215	రూ.25.01 కోట్లు
జగనన్న విద్యా కానుక	686	రూ.48.70 లక్షలు
విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ	104	రూ.12.70 లక్షలు
జగనన్న తోడు (రుణాలు)	234	రూ.51 లక్షలు
జగనన్న గోరు ముద్ద	525	రూ.68.3 లక్షలు
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	1,427	రూ.2.67 కోట్లు
ఇంటింటికీ రేషన్	5,267	రూ.11.50 కోట్లు
మొత్తం		రూ.41.00 కోట్లు

గ్రామంలోని ఐదు సచివాలయాల్లో ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో కలిగిన లబ్ధి పత్యక్ష ప్రయోజనాలు (డీబీటీ)

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి(రూపాయల్లో)
జగనన్న అమ్మ ఒడి	2,233	రూ.9.45 కోట్లు
జగనన్న విద్యా దీవెన	1,278	రూ.5.40 కోట్లు
జగనన్న వసతి దీవెన	958	రూ.1.35 కోట్లు
వైఎస్సార్ రైతు భరోసా	1,247	రూ.5.74 కోట్లు
వైఎస్సార్ ఉచిత పంట బీమా	200	రూ.36 లక్షలు
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	281	రూ.6.95 లక్షలు
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	258	రూ.18.7 లక్షలు
వైఎస్సార్ మత్స్యకార భరోసా	1	రూ.10 వేలు
వైఎస్సార్ పింఛన్ కానుక	2,229	రూ.20.27 కోట్లు
వైఎస్సార్ చేయూత	776	రూ.3.33 కోట్లు
వైఎస్సార్ ఆసరా	3,005	రూ.11.82 కోట్లు
వైఎస్సార్ సున్నా వడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	3,833	రూ.87.3ం లక్షలు
వైఎస్సార్ కాపు నేస్తం	693	రూ.2.71 కోట్లు
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	114	రూ.30.30 లక్షలు
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	832	రూ.3.64 కోట్లు
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	507	రూ.40.6 లక్షలు
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపు)	1,003	రూ 7.39 కోట్లు
వైఎస్సార్ బీమా	42	రూ.55.8 లక్షలు
వైఎస్సార్ వాహన మిత్ర	210	రూ.71.80 లక్షలు
జగనన్న చేదోడు	113	రూ.23.4 లక్షలు
ప్రత్యేక కోవిడ్ సహాయం	4,734	రూ.47.30 లక్షలు
జగనన్న తోడు(వడ్డీ)	163	రూ.73,056
మొత్తం		రూ.75.37 కోట్లు

నేడు బాల పేరంటాలమ్మకు పసుపు, కుంకుమ సమర్పణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని బాల పేరంటాలమ్మ వారి గ్రామోత్సవం సందర్భంగా ఆదివారం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు ఆలయం తరుపున పసుపు, కుంకుమను సమర్పిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం బాల పేరంటాలమ్మను ఇరు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం, సోమవారం ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. ఈ ఊరేగింపులో అమ్మవారికి మొక్కుబడులు, కానుకలు సమర్పిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం నుంచి బాల పేరంటాలమ్మకు పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు.

యార్లగడ్డ చీప్ పబ్లిసిటీ స్టంట్

గన్నవరం: టీడీపీకి చెందిన నాయకులకే ఆ పార్టీ కండువాలు కప్పి టీడీపీలో చేర్చుకోవడం.. తద్వారా టీడీపీ బలపడిపోయినట్లు ప్రజల్లో భ్రమలు కల్పించడం.. ఇది గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి. ఈ తరహా పబ్లిసిటీ స్టంట్‌కు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు తెరతీశారు. దీనికి శనివారం కానూరులోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన టీడీపీలో చేరికల కార్యక్రమం వేదికగా నిలిచింది. వైఎస్సార్ సీపీలో కనీసం ప్రాథమిక సభ్యత్వం లేని, ఏ రోజు వైఎస్సార్ సీపీ కండువా కప్పుకోని టీడీపీ నేతలు బోయపాటి బసవపూర్ణయ్య(నల్లబాబు), బీబీ.గూడెం పీఏసీఎస్ అధ్యక్షుడు బోయపాటి మురళీకృష్ణ(బుల్లియ్య), గన్నవరం పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు పాలడుగు నాని, మర్లపాలెంకు చెందిన మేడసాని రామకృష్ణకు యార్లగడ్డ టీడీపీ కండువాలు కప్పడం ఎన్నికల స్టంట్‌గా పలువురు రాజకీయవేత్తలు పేర్కొంటున్నారు. నాలుగేళ్ల క్రితమే వైఎస్సార్ సీపీకి దూరమై యార్లగడ్డతో రాజకీయ ప్రయాణం చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాదరావుతో పాటు పలువురు నేతలకు కండువాలు కప్పి టీడీపీలో చేర్చుకోవడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

పెనమలూరు: గంజాయి కేసులో తప్పించుకోని తిరుగుతున్న నిందితుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు శనివారం వివరాలు తెలుపుతూ గంజాయి కేసులో తప్పించుకోని తిరుగుతున్న మచిలీపట్నం ఈడేపల్లికి చెందిన తంగెళ్ల నవీన్ కుమార్‌ను అరెస్ట్ చేశామన్నారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని తెలిపారు. గంజాయి సేవించినా, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ అజెండా

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్



కంకిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా అని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, పార్టీ పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. కంకిపాడు పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం ఇంటింటి ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్య తన దృష్టిలో ఉందని, సమస్యల పరిష్కారం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి అఖండ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమ పాలన అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హత ఒక్కటే ప్రామాణికంగా పథకాలను వర్తింప చేసి ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలనతో ప్రజలు సంతోషంగా ఉంటే ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి కన్నుకుడుతోందన్నారు. అంతా ఏకమై వైఎస్సార్ సీపీని ఓడించేందుకు పూనుకున్నారని విమర్శించారు. ప్రజలు సంతోషంగా ఉంటే చూడలేకపోతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ప్రతిపక్ష కూటమికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

ముస్లింలకు అండగా..

చట్టసభల్లో ముస్లింలకు ఎంతో ప్రాధాన్యం కల్పించిన పార్టీ వైఎస్సార్ సీపీ అని మంత్రి జోగి రమేష్ అన్నారు. పట్టణంలోని పలు ముస్లిం సామాజిక వర్గ కుటుంబాలను మంత్రి ఆత్మీయంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలు అన్ని విధాలా అభ్యున్నతి సాధించేందుకు సీఎం జగనన్న తోడ్పాటునందిస్తున్నారన్నారు. చట్ట సభల్లోకి సైతం అత్యధికులను పంపేలా తాజా జాబితాలో స్థానాలు కల్పించారని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మేలును గుర్తించి, సంక్షేమం, అభివృద్ధి కోసం మరలా వైఎస్సార్ సీపీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, సర్పంచ్ బాకీ రమణ, ఎంపీటీసీలు చిట్టూరి ప్రసాద్, కోనా కృష్ణకిషోర్, సగర, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు నక్కా శ్రీనివాసరావు, నందిపాటి బిందుమాధవి, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, కోలవెన్ను సొసైటీ చైర్మన్ టక్కెం సతీష్‌కుమార్, సర్పంచ్‌లు సిహెచ్ ఆదర్శకుమార్, బి.శివనాగిరెడ్డి, నాయకులు తంబాబత్తుల ఓంకారం, కరీముల్లా, బాజీ, కంకిపాటి రమేష్, తంబాబత్తుల వెంకటేశ్వరరావు, కలపాల వజ్రాలు, తాడేపల్లి సతీష్‌కుమార్, కొండవీటి సుబ్బారావు, చెన్నుబోయిన సుబ్బారావు, లాం సురేష్, పర్వతనేని సుభాష్, కాగిత రాజా రమేష్, నాగదేవి రవి, జోజిమేరీ, అబ్దుల్లా, మల్లు, బీహెచ్ నాగిరెడ్డి, బిహెచ్ రాజగోపాల్‌రెడ్డి, జొన్నలగడ్డ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రిస్టియన్, మైనార్టీల సంక్షేమానికి తోడ్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవి

గన్నవరం: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. క్రిస్టియన్ మైనార్టీలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగుదలకు సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి తోడ్పాటును అందించారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపాయని చెప్పారు. పేదల పక్షపాతి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి క్రిస్టియన్ మైనార్టీలు మద్దతుగా నిలవాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్య, ఉపాధి పరంగా వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ ఆర్థికంగా అండగా నిలిచారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా వైఎస్.జగన్‌ను, ఎమ్మెల్యేగా వంశీమోహన్‌ను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జలసూత్రం రామ్మోహన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, శీలం రంగారావు, ఎలక్షన్ ఇన్‌చార్జి ఆర్‌వీఆర్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, మండల అధ్యక్షుడు పి.పేతురు, సుందర్ రాజు, విజయ్‌బాబు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ డి.రాజు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రాజు

ఉయ్యూరు: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని పెనమలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ డి.రాజు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి రాజు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. కోడ్ ను ఉల్లంఘించే చర్యలపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచార అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ర్యాలీలు, సభలకు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఎవరు ముందస్తుగా దరఖాస్తులు చేస్తే వారికే అనుమతి ఉంటుందన్నారు. ఒకే రూట్‌లో రాజకీయ పక్షాల ర్యాలీలు ఉంటే సమయాన్ని నిర్దేశిస్తామన్నారు. నగదు, ప్రచార సామగ్రిపై నిఘా ఉంచామని తెలిపారు. నిరంతరం ఫ్లయింగ్ స్క్వాడ్, అధికారుల బృందం పర్యటిస్తూ తనిఖీలు చేస్తుందన్నారు. సరైన ఆధారాలు, అనుమతులు లేకుండా నగదు, వస్తువులు రవాణాలో పట్టుబడితే సీజ్ చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ వద్ద ఆధారాలు చూపితే ఆ నగదు, వస్తువులు అందిస్తామన్నారు. లేనిపక్షంలో ఆదాయ పన్ను అధికారులకు అప్పగిస్తామన్నారు. ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అభ్యర్థుల వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉండకూడదన్నారు. ఫ్లెక్సీలు, ప్రచా ర హోర్డింగ్‌లను ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన 72 గంటల్లో తొలగించామన్నారు. ప్రచారం ఉద యం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకే చేసు కోవాలన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు ఎన్నికల నియమావళిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. సమావేశంలో ఉయ్యూరు తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కృష్ణా-ఏలూరు జిల్లాల సరిహద్దులో 16వ నంబర్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పారా మిలటరీ సాయుధ దళాలు జాతీయ రహదారిపై శనివారం కవాతు నిర్వహించాయి. అనంతరం చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తు న్న తరుణంలో నగదు, బంగారు, ఇతర వస్తువుల రవాణాలపై దృష్టి పెట్టామన్నారు. సరైన బిల్లులు చూపకుండా అధిక మొత్తంలో నగదు, బంగారం, ఇతర వస్తువులు రవాణా చేస్తే సీజ్ చేస్తామని తెలిపారు.

'ఎన్నికల్లో ప్రాధాన్యమివ్వని పార్టీలకు గుణపాఠం చెబుతాం'

కంకిపాడు: రానున్న ఎన్నికల్లో మాలలకు ప్రాధాన్యమివ్వని రాజకీయ పక్షాలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు పిలుపునిచ్చారు. కంకిపాడులోని సంఘ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో మాలలను తొత్తులుగా, ఓటు బ్యాంకుగా వాడుకునే రాజకీయ పక్షాలను చిత్తుగా ఓడించాలన్నారు. ఐక్యత దిశగా పని చేయాలని సూచించారు. ఒత్తిళ్లకు, వివాదాలకు తలొగ్గకుండా సామాజిక, రాజకీయ ఎదుగుదల దిశగా ఆలోచన చేయాలని, మాలమహానాడు అండగా ఉంటుందని వివరించారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముప్పా సుబ్రహ్మణ్యం, పెనమలూరు, గన్నవరం, పామర్రు నియోజకవర్గాల అధ్యక్షులు పి.రామకృష్ణ, సరిహద్దు ఆంటోని, దర్శి శ్రీనివాసగాంధీ, మారుమూడి రాంబాబు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం తగదు



సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: బకాయి ఉన్న ఆస్తి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చూపరాదని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం కమిషనర్ రెవెన్యూ అధికారులు, నాలుగు సర్కిళ్ల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది అంత టీమ్‌గా ఏర్పడి ఆస్తి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మార్చి 31వ తేదీ నాటికి 100 శాతం ఆస్తి పన్నులు వసూళ్లు చేయాలని కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు.

పోరంకిలో తనిఖీలు

పోరంకిలోని 3, 5 వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో రికార్డులు పరిశీలించారు. ఆస్తి పన్నులు 100 శాతం వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నగర మార్కెట్‌లోకి మహీంద్ర ఎలక్ట్రిక్ కారు



కారును ఆవిష్కరిస్తున్న సంతోష్ కుమార్

రామవరప్పాడు: ప్రసాదంపాడులోని మహీంద్ర షోరూంలో సరికొత్త ఎక్స్‌యూవీ 400 ఎలక్ట్రిక్ కారును మహీంద్ర ఆటోమోటివ్ మాన్యుఫాక్చరర్స్ సీఈఓ సంతోష్‌కుమార్ శనివారం నగర మార్కెట్‌లోకి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ సరికొత్త ఎలక్ట్రిక్ కారు మరింత పవర్‌తో, సమర్థవంతమైన బ్యాటరీ కెపాసిటీతో రూపొందించామన్నారు. మార్కెట్‌లో లభించే ఎలక్ట్రిక్ కార్ల కన్నా ఈ కారు తక్కువ ధరలో లభిస్తుందని చెప్పారు. వినియోగదారుల సౌకర్యార్థం డెమో కార్లు షోరూమ్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 31వ తేదీలోగా కారును బుక్ చేసుకున్న వారికి ప్రత్యేక ధరతో పాటు మరిన్ని బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్



యనమలకుదురులో నివాళులర్పిస్తున్న నాయకులు

పెనమలూరు: స్వాతంత్ర్య సమరంలో అసువులు బాసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ నేటి తరానికి ఆదర్శప్రాయులని వక్తలు సూచించారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురులో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని శనివారం నిర్వహించారు. డీవైఎఫ్‌ఐ నాయకుడు పి. క్రాంతి, సీఐటీయూ నాయకులు యు.త్రిమూర్తు లు, విశ్వపతి నాగేశ్వరరావు, మౌలాలీ, షేక్ ఖాశిం, ఎస్‌కే సిద్దయ్య, దానయ్య, మస్తాన్, తులసీరామ్, అశోక్‌కుమార్, అబ్దుల్, అమీషా పాల్గొన్నారు.

నున్నలో భగవత్ సింగ్ వర్ధంతి

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఐసా ఆధ్వర్యంలో ఎలిమెంటరీ స్కూల్ నందు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ల వర్ధంతి కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అమరులు చేసిన పోరాటాలు, ఉద్యమాల గురించి ఐసా విద్యార్థి సంఘం ప్రతినిధులు మహేష్, విజయకృష్ణ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ ఓటమితో నెరవేరనున్న భగత్‌సింగ్ ఆశయం



గన్నవరంలో నివాళులర్పిస్తున్న నేతలు

గన్నవరం: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఓటమి ద్వారానే భగత్‌సింగ్ ఆశయం నెరవేరుతుందని ఆల్ ఇండియా కిసాన్ సభ అధ్యక్షుడు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రావుల మాట్లాడుతూ.. భగత్‌సింగ్ వంటి ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. అలాంటి దేశాన్ని సర్వనాశనం చేయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలిపారు. దేశభక్తులమని మాటల్లో చెబుతున్న ప్రధాని నరేంద్రమోదీ చేతల్లో దేశాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. ప్రమాదకరమైన బీజేపీ కూటమిని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, కిసాన్ సభ జిల్లా అధ్యక్షుడు యలమందరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.